క్లుప్తంగా

కాపర్ కేబుల్ చోరీ

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదపూడి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో మంగళవారం అర్ధరాత్రి రూ.50 వేల విలువ చేసే కాపర్ కేబుల్ చోరీకి గురైంది. రాత్రి వర్షం పడిన తర్వాత దొంగతనం జరిగినట్లుగా ఆ శాఖ అధికారులు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు ప్రధాన ద్వారం (గేటు) తాళం, ప్రవేశద్వార తాళం, బ్యాటరీలు భద్రపరిచే గది తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి కాపర్ కేబుల్ తీసుకుని వెళ్లారు. బుధవారం ఉదయం కార్యాలయానికి వచ్చినప్పుడు దొంగతనం జరిగినట్లుగా గుర్తించి, కూచిపూడి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

ఏసు మార్గం అనుసరణీయం



పామర్రు: ఏసు క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక అసీస్సీ చర్చిలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికమైన భావాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి, అసీస్సీ స్కూల్‌యాజమాన్యం పాల్గొన్నారు.

పాస్టర్ల అభ్యున్నతికి కృషి

పామర్రు: పాస్టర్ల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక నాగపట్నం వద్ద ఉన్న సీ కన్వెన్షన్ హాల్లో నియోజకవర్గ స్థాయి పాస్టర్ల సమావేశం, సెమీ క్రిస్మస్ వేడుకలను బుధవారం నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని విఘ్నేశ్వర స్వామి ఆలయంలో బుధవారం లక్ష్మీ గణపతి హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం, సమాజ సంక్షేమం దృష్టిలో పెట్టుకుని ఈ హోమం నిర్వహించినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాస్ తెలిపారు. 107 మంది దంపతులు ఈ పూజాకార్యక్రమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు.

21న మండల పరిషత్ సమావేశం

పమిడిముక్కల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ కాసాని వేద సుప్రజ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

మినుము సాగులో సస్య రక్షణ చర్యలు



గుడివాడరూరల్: మినుము సాగులో రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ బోలెం అనంతలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కల్వపూడి అగ్రహారం, గుంటాకోడూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏఈఓలు అనిత, ప్రదీప్, వీఏఏలు పాల్గొన్నారు.

రీసర్వే ప్రారంభం



వేములమడ(మొవ్వ): మొవ్వ మండలంలో రీసర్వే ప్రాజెక్ట్‌కు ఎంపికైన వేములమడలో బుధవారం సర్వే కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. వీఆర్వో, ఇద్దరు సర్వేయర్లు, వీఆర్‌ఏ, అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహించారు. సర్వే కార్యక్రమాన్ని రీ సర్వే డెప్యూటీ తహసీల్దార్ పి.జగన్ మోహనరావు, మండల సర్వేయర్ కిషోర్ బాబు పర్యవేక్షించారు. గ్రామ సర్వేయర్ జి.తేజశ్రీ తదితరులు సహకరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

పామర్రు: బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ ఎంతగానో ఉపయుక్తం అవుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెదపారుపూడి మండలానికి చెందిన సీహెచ్ రంగారావుకు సీఎంఆర్‌ఎఫ్‌గా రూ.1.51లక్షలను అందజేసినట్లు తెలిపారు.



వేణుగోపాలస్వామి ఆలయం (ఇన్‌సెట్లో స్వామివారు)

వేదానికి మూల బీజమైన తిరుప్పావై 30 పాశురాలను ధనుర్మాసంలో రోజూ పఠిస్తూ ఆండాళ్ అమ్మవారి కటాక్షం పొందితే భగవంతుడు అనుగ్రహిస్తాడని భక్తుల విశ్వాసం. పరమాత్మను ప్రసన్నం చేసుకునేందుకు ధనుర్మాసం దీక్ష చేపట్టి స్వామిని నెల రోజుల పాటు నిత్యం దర్శించుకుని పాశుర పఠనం చేస్తారు. ఈ మాసంలో విష్ణువును మధుసూదనుడిగా పూజించడం విశేషం.

రెండు శతాబ్దాలుగా ఆబాల గోపాలం

వేణుగోపాలస్వామి ఆలయంలో వైభవంగా ధనుర్మాస పూజలు

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలను వైభవంగా చేపట్టారు. 200 ఏళ్ల పైబడిన ఈ సంతాన వేణుగోపాలుని ఆలయ విశిష్టత అత్యంత ఆసక్తి కరం. స్వామిని ప్రతిష్ఠించి రెండు వందల ఏళ్లకు పైగా ఈ ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలుగా వల్లభనేని వంశం వారు వ్యవహరిస్తున్నారు. ఈయన సంతాన వేణుగోపాలస్వామిగా కూడా భక్తుల పూజలను అందుకుంటున్నారు. ప్రస్తుతం ధనుర్మాస పూజలతో స్వామి సన్నిధిలో తరిస్తున్నారు.

స్వామి చరిత్ర అమోఘం

ఈ సంతాన వేణుగోపాలుడ్ని స్థానిక భక్తులు విశ్వసించే విగ్రహ చరిత్రలోకి వెళితే చాలా అమోఘంగా ఉంటుంది. 200 ఏళ్ల క్రితం కూచిపూడిలోని భాగవతుల ఇళ్లల్లో వెన్న, నెయ్యి మాయమవుతూ ఉండేవి. పండితుల కథనం మేరకు ఆ ఇళ్ల మధ్యనే ఆరు అడుగుల లోతులో గొయ్యి తవ్వగా వేణుగోపాలుడి విగ్రహం బయటపడింది. ఆ దైవం తమ ఇళ్ల మధ్య ఉండకూడదని కొందరు చెప్పారు. దీంతో ఆ ఊరి సంతలోనే ఆ విగ్రహాన్ని వేలం వేశారు. గుడ్లవల్లేరు నుంచి అక్కడికి వెళ్లిన వల్లభనేని భూపతిరాయుడు కృష్ణుడి భక్తుడు కావటంతో ఆ విగ్రహానికి ఆకర్షితులై వేలంపాటలో ఆయన పాడుకున్నారు. అనంతరం స్వామి కలలో కనబడి తనకు గుడి నిర్మిస్తే గ్రామాన్ని పాడి పంటలు, సిరి సంపదలతో తులతూగేలే చేస్తానని భూపతిరాయుడికి చెప్పారు. స్వామి అడిగిందే తడవుగా ఆయన గుడి నిర్మించారు.



గోవుల అందాల పోటీలు (ఫైల్)

ధనుర్మాస పూజల్లో తరిస్తున్న భక్తులు



స్వామివారి సన్నిధిలో భక్తులు ధనుర్మాస పూజల్లో తరిస్తున్నారు. నెల గంట పట్టిన నాటి నుంచి ఈ పూజలను ప్రారంభిస్తాం. ఆలయంలో ఒక రకంగా ఆధ్యాత్మిక పండుగ వాతావరణం నెలకొంది. విష్ణుమూర్తికి ఈ ధనుర్మాస నెల అత్యంత ప్రీతిపాత్రమైనది.

– డాక్టర్ అగ్నిహోత్రం ఫణిగోపాల్, ఆలయ అర్చకుడు

సంతాన వేణుగోపాలుడిగా ప్రసిద్ధి

భాగవతుల కలలో కనబడి మాత్రం తనను సంతలో అమ్ముతారా? అంటూ నాట్య కళల ప్రదర్శనలు ఇచ్చే జీవనం చేయాలని స్వామి అన్నారు. ఆనాటి నుంచి అమెరికాలో తానాకు వెళ్లినా.. కూచిపూడి భాగవతులు విధిగా గుడ్లవల్లేరులో స్వామి సన్నిధికి వచ్చి గజ్జె కట్టి వెళ్తారు. ఎన్నో ఏళ్లగా సంతానం లేనివారికి సంతానం కల్పించి స్వామి సంతాన వేణుగోపాలుడిగా కూడా గ్రామంలో ప్రసిద్ధిగాంచారు.

గోవుల అందాల పోటీలు



వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో గుడ్లవల్లేరు నెహ్రూ పశువుల సంత, గ్రామాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో కార్తీక శుద్ధ ఏకాదశి రోజున గోవుల అందాల పోటీలతో పాటు పాల పోటీలను నిర్వహిస్తాం. వందల మంది మహిళలు, విద్యార్థులకు రోజ్‌మిల్క్ పంపిణీ జరుగుతుంది. గోవులకు నిర్వహించిన అందాల పోటీలు, పాల పోటీల్లో గెలుపొందిన గో యజమానులకు బహుమతుల ప్రదానం చేస్తాం.

– వల్లభనేని వెంకట సుబ్బారావు, గుడ్లవల్లేరు నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్

1817లో స్వామి ప్రతిష్ట



ఈ ఆలయంలో 1817లోనే వల్లభనేని భూపతిరాయుడు స్వామిని ప్రతిష్ఠించారు. ఆ తర్వాత వల్లభనేని జగ్గయ్య, వీర రాఘవుడు, లక్ష్మణస్వామి, సీతారామయ్య, సూర్యప్రకాశరావు, వెంకట్రావు చైర్మన్లగా ఏడు తరాల వారు వ్యవహరించారు. ప్రస్తుతం ఎనిమిదో తరం చైర్మన్‌గా నేను వ్యవహరిస్తున్నాను. అర్చకులు కూడా ఏడు తరాల వారే స్వామికి పూజలు ఒనరించటం విశేషం.

– వల్లభనేని సీతారాం, ఆలయ వంశపారంపర్య చైర్మన్

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

గుడివాడరూరల్: రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని బేతవోలులో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు భూ పరమైన సమస్యలను సదస్సుల్లో విన్నవించుకోవాలన్నారు. ఆర్‌ఐ నాగబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరిస్తాం

గుడ్లవల్లేరు: తాము నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో అర్జీలను స్వీకరిస్తామని తహసీల్దార్ బి.లోకరాజు పేర్కొన్నారు. బుధవారం డోకిపర్రు రెవెన్యూ సదస్సులో అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ అర్జీలను పరిశీలించి, సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఎంఆర్‌ఐ శివ కుమార్, మండల సర్వేయరు పర్వీన్ సుల్తానా పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: భూ సంబంధిత సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ కె.గోపాల్ అన్నారు. మండలంలోని నుచ్చుమిల్లిలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భూమి సర్వేపై మూడు అర్జీలు అందజేశారు. ఆర్‌ఐ శ్రావణి, వీఆర్వో భానుప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పద్మ, విలేజ్ సర్వేయర్ భావన పాల్గొన్నారు.

వైవాకలో..

ముదినేపల్లి రూరల్: రైతులు తమకు సంబంధించిన భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వైవాకలో రెవెన్యూ గ్రామసభ బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల వద్దకే అధికారులు వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ సుభానీ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు మొవ్వ విద్యార్థులు

మొవ్వ: పశ్చిమగోదావరి జిల్లా రావులపాలెంలో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ పోటీలకు మొవ్వలోని శ్రీ మండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం సూర్యదేవర శ్రీదేవి బుధవారం తెలిపారు. బాలుర విభాగంలో సాల్మన్‌రాజు, బాలికల విభాగంలో మునిపల్లి ద్రాక్షాయణి ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరిని పీడీలు రామారావు, మండలి మనోహరి తదితరులు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీలకు పీడీ రామారావు ఎంపిక

మొవ్వ: ఇటీవల గుడివాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో స్థానిక శ్రీ మండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్ పీడీ అప్పికట్ల రామారావు ట్రిపుల్ జంపులో ప్రథమ స్థానం, 800 మీటర్ల రన్నింగ్‌లో తృతీయ స్థానం సాధించారు. ఈ మేరకు బుధవారం పాఠశాల్లో హెచ్‌ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో పీడీని సత్కరించారు. ఈ సందర్భంగా పీడీ రామారావు మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు రాజస్థాన్‌లోని అల్వార్ నందు జరిగే మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, పాఠశాల సిబ్బంది కార్యదర్శి జాకీర్ అహ్మద్, ఉప కార్యదర్శి మేకరాణి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మనోహరి తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం, పీడీ



పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించిని హెచ్‌ఎం ప్రసాద్, పీఈటీ రవీంద్ర

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: తాడంకి హైస్కూల్‌కు చెందిన బాకి మాధవి, కాగితాల గీతాంజలి రాష్ట్ర స్థాయి కబడ్డి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ప్రసాద్ తెలిపారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. హైస్కూల్లో బుధవారం ఎంపికైన విద్యార్థినులను, పీఈటీలు ఏపీ రాజు, రవీంద్రబాబును అభినందించారు.

భారీ అన్న సమారాధన

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన బుధవారం ఏర్పాటు చేశారు. స్వామివారి షష్ఠి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ అన్న సమారాధనకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్వామి పుట్టలో పాలుపోసి పూజలు చేసి ఆహార పదార్థాలు స్వామికి నైవేద్యంగా సమర్పించి, అన్న సమారాధన ప్రారంభించారు. భక్తుల రద్దీతో సింగరాయపాలెం సెంటర్ కిటకిటలాడింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. భారీ వాహనాలను ఇతర రూట్ల మీదుగా మళ్లించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కూటమి నేతలు పాల్గొనగా సహాయ కమిషనర్ గంగాశ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



స్వామికి ఆహార పదార్థాలు నైవేద్యంగా సమర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డీవైఈఓ పద్మరాణి, పుట్టి నాగలక్ష్మి

గుడివాడ టౌన్: ప్రతిభావంతులైన విద్యార్థులను విశ్రాంత ఉపాధ్యాయులు ప్రోత్సహించడం అభినందనీయమని డీవైఈఓ ఐ.పద్మరాణి అన్నారు. స్థానిక ఆంధ్రనలంద మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ఆమె బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న కళాఉత్సవ్ జాతీయ పోటీలకు ఎంపికైన పాఠశాల విద్యార్థులకు మున్సిపల్ హైస్కూల్ విశ్రాంత హెచ్‌ఎం పుట్టి నాగలక్ష్మి ప్రోత్సహించడం ఆదర్శనీయం అన్నారు. త్వరలో జరగనున్న బాలారంగ్‌లో థింసా నృత్యంతో పాటు ఇతర నాటక పోటీలకు పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. వీరిని అభినందిస్తూ పుట్టి వెంకటేశ్వరరావు సామాజిక సేవాసంస్థ తరఫున ఈ బహుమతులు అందజేశారన్నారు.

సంక్షిప్త వార్తలు

■ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కలిదిండి(కైకలూరు): రెవెన్యూ సదస్సులను రైతులు ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. కలిదిండి మండలం ఆవకూరులో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామ సభలకు మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరవుతున్నారన్నారు. రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దారు రామకృష్ణ, కూటమి నేతలు జోగిరాజు, శ్రీనివాసచౌదరి, రమాదేవి, చలపతి పాల్గొన్నారు. కైకలూరు పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సభ నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి మొత్తం ఏడు అర్జీలు అందాయి. కార్యక్రమంలో సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం పాల్గొన్నారు.

■ ప్రశాంతంగా రేషన్ డీలర్ల పరీక్షలు

గుడివాడ టౌన్: గుడివాడ డివిజన్ పరిధిలోని రేషన్ డీలర్ల నియామకానికి సంబంధించి ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక మాంటిస్సోరి హైస్కూల్లో బుధవారం నిర్వహించిన ఈ రాత పరీక్షలకు సంబంధించి గన్నవరం 14, బాపులపాడు 11, ఉంగుటూరు 9, నందివాడ 8, గుడ్లవల్లేరు 3, పెదపారుపూడి 4 రేషన్ షాపులకు రాత పరీక్షకు దరఖాస్తులు స్వీకరించారు. 88 దరఖాస్తులు రాగా వాటిలో తొమ్మిది దరఖాస్తులు తిరస్కరించారు. మొత్తం 79 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 78 మంది పరీక్షలకు హాజరైనట్లు ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి. బాలాజీ పాల్గొన్నారు.

■ విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

గుడ్లవల్లేరు: మైనార్టీ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో కొతవరం ఉర్దూ స్కూల్లో మైనార్టీ హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్లేట్లు, బౌల్స్‌ను పంపిణీ చేశారు. లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై.పి.సి. ప్రసాద్, లయన్స్ ప్రతినిధులు నవాబు, చిట్టిబాబు పాల్గొన్నారు.

■ బాడీ బిల్డింగ్‌లో క్రీడాకారుని ప్రతిభ



గుడివాడ టౌన్: జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలో తమ క్రీడాకారులు ప్రతిభను ప్రదర్శించి కాంస్య పతకాన్ని సాధించినట్లు స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కె.రంగప్రసాద్ అన్నారు. స్టేడియం కార్యాలయంలో క్రీడాకారుడు నత్తా నితీష్‌కుమార్‌ను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ విజయవాడలో జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీ బిల్డింగ్ పోటీలో తమ క్రీడాకారుడు 75 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారని పేర్కొన్నారు.

■ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు అన్నారు. మండలంలోని వలివర్తిపాడు బైపాస్‌రోడ్డులో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

■ పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

ముదినేపల్లి రూరల్: వడాలి జెడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి మంగళవారం మైక్‌సెట్ బహూకరించారు. గ్రామంలో కిరాణా షాపు నిర్వహిస్తున్న రాజేంద్రప్రసాద్ అనే పూర్వపు విద్యార్థి తనవంతు సాయంగా వైర్‌లెస్ మైక్‌సెట్‌ను ప్రధానోపాధ్యాయుడు వి.ప్రభుదాస్, ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావుకు బుధవారం అందజేశారు.

■ డీసీ చైర్మన్ మల్లిపెద్దికి సన్మానం

గుడ్లవల్లేరు: కొతవరం ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో నూతనంగా ఎన్నికైన డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యాన్ని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం సన్మానించి అభినందించారు. డీసీ వైస్ చైర్మన్ పరసా పోతురాజుతో పాటు సాగునీటి కార్యవర్గాలు పాలేటి నాగాంజనేయులు, వీరమాచినేని శివప్రసాద్ పాల్గొన్నారు.

■ కొనసాగుతున్న నగర సంకీర్తన

మండవల్లి: మండవల్లిలోని షిర్డీ సాయిబాబా మందిరంలో ధనుర్మాసం పురస్కరించుకుని బుధవారం నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఇంటింటికీ వెళ్లి భిక్ష స్వీకరించారు. గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

■ తుది దశకు చేరుకున్న క్రికెట్ పోటీలు

కైకలూరు: నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. కామినేని సిరీస్ పేరుతో ఈ నెల 13న స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కొల్లి వరప్రసాద్ ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించారు. నియోజకవర్గం నుంచి మొత్తం 45 జట్లు పాల్గొన్నాయి. బుధవారం నిర్వహించిన సెమీ ఫైనల్స్‌కు వేగ రెస్టారెంట్ టీం (కైకలూరు), మధు (ఆటపాక), చిన్నచెరువుగట్టు (కై కలూరు) జట్లు చేరాయి. గురువారం మండవల్లి – ప్రతాప్(కైకలూరు) జట్ల మధ్య నిర్వహించే పోటీలో గెలిచిన జట్టు సెమీ ఫైనల్స్‌కు చేరుతుంది.

దూడూ బసవన్నల సందడి



నెల గంట పట్టేసరికి గ్రామాల్లో దూడూ బసవన్నల సందడి అధికమైంది. గుడ్లవల్లేరులో బుధవారం దూడూ బసవన్నలను ఆడిస్తూ.. కళాకారులు చూపరులను ఆకట్టుకున్నారు. 'అయ్యవారికి దండం పెట్టు' అంటూ రకరకాల విన్యాసాలను బసవన్నతో చేయిస్తూ అందర్నీ ఆకట్టుకున్నారు.

– గుడ్లవల్లేరు

వర్షంతో రైతుల ఆందోళన

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో కురిసిన వర్షపు జల్లులకు వరి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి వర్షం కురవటంతో పాటు బుధవారం ముసురుతో ఏర్పడిన చల్లని వాతావరణం రైతులకు వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు పరదాలను తీసుకుని పొలాల వైపు పరుగులు తీశారు. ఆరుగాలం పండించిన పంటను గూటికి చేర్చుకునేందుకు అధిక ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే వరి పనలపై పంట ఉండటంతో వర్షం వస్తే ఎక్కడ మునిగిపోతాయోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – గుడ్లవల్లేరు



అంగలూరులో చాపలా పడకేసిన వరి



గుడ్లవల్లేరులో పనలపై ఉన్న వరి



గుడ్లవల్లేరులో పరదాలు మోసుకెళ్తున్న రైతులు



అంగలూరులో ధాన్యాన్ని బస్తాలకు ఎత్తిన రైతులు